
# మహానగరం కథలు
## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!




# మాటే మంత్రము..

**పొద్దున్నే** బెల్ మోగడంతో నెమ్మదిగా సోఫాలోంచి లేచి వెళ్ళి తలుపు తీశాను.

"నమస్తే అండీ! మీరు తెలుగువాళ్ళుట కదా!" కొద్దిగా యాస ధ్వనిస్తున్న, తెలుగులో అడుగుతుతోంది బయట నిలబడి ఉన్న అమ్మాయి.

మా అబ్బాయి ఒక్కడూ ఉంటూ చెయ్యి కాల్చుకుంటూ ఇబ్బంది పడుతున్నాడని ఈ మధ్యనే మావాడి దగ్గరకి బెంగుళూరు వచ్చాము మేమిద్దరం. బెంగుళూరులో చాలా మందికి తెలుగు వచ్చినా మా వాడి అపార్ట్మెంట్‌లో ఎంత మంది తెలుగువాళ్ళున్నారో, ఏమిటో? ఈ మధ్యనే వచ్చిన మాకు తెలీదు, వాడికక్కరలేదు. వాడి పనీ, పాటలూ, స్నేహితులూ ఇదే వాడి లోకం. మేము వచ్చిన ఈ కొద్దిరోజుల్లో ఇల్లు

సర్దడం, ఇంట్లోకి కావలసిన వస్తువులూ అవీ మా వాడి సాయంతో కొని తెచ్చుకోవడం లాంటి వాటితో సరిపోయింది. వాడి స్నేహితుల్లోనూ, మా ఇరుగు పొరుగు వారిలోనూ తెలుగు వాళ్ళు లేదు.

అలాంటిది ఒక్కసారిగా తెలుగు మాట వినిపించేసరికి నా మనసు పులకించిపోయింది. తెల్లగా చందనం బొమ్మలా ఉంది నన్ను పలకరించిన అమ్మాయి. పచ్చని పట్టుచీర, తలంటుకుని క్లిప్ పెట్టుకున్న జుట్టు, నుదిటిన బొట్టు, పాపిట సింధూరం, మెడలో కొత్తగా, పచ్చగా మెరుస్తున్న మంగళసూత్రం, నల్లపూసలూ.. చేతినిండా చీర రంగుకు సరిపడే గాజులూ.. ఒక్క క్షణం ఆ అమ్మాయి మీదనించి చూపుమరల్చుకోలేకపోయాను. లేత తమలపాకుల్లాంటి పాదాలకి పసుపు రాసుకుని ఉంది, ఆపైన మెరుస్తున్న తెల్లటి వెండి మట్టెలు.. ఎంత ముద్దుగా, లక్షణంగా ఉందో! అనుకోకుండా ఉండలేకపోయాను.

"అవునమ్మా! మీరు? నువ్వు?" అన్నాను అప్రయత్నంగా నువ్వు అని వచ్చేసింది ఏమనుకోవద్దు" అన్నాను చప్పున.

"పరవాలేదండీ! నేను చిన్న, మీ పెద్దవారు నువ్వు అంటేనే బావుంది" అంది చిరునవ్వుతో.

ఆ నవ్వు చూస్తే మరింత ముచ్చటేసింది. నాకు. "నాకూ ఇలాంటి కోడలు వస్తే ఎంత బావుంటుందో కదా!, అనిపించింది ఒక్క క్షణం"

"ఎంత నమ్రత?" అనుకోకుండా ఉండలేకపోయాను.

" థాంక్స్ అమ్మా! చెప్పు ఏమిటి విషయం?" అన్నాను నేను కూడా చిరునవ్వు నవ్వుతూ.

"ఈ రోజు శ్రావణ మంగళవారం కదా! మా మదర్ ఇన్‌లా చెప్పారు తెలుగు వాళ్ళకి తాంబూలం ఇవ్వమని. మేము ఇక్కడికి కొత్తగా వచ్చాము. మేనేజర్ ని అడిగితే మీతో పాటు ముగ్గురి పేర్లు చెప్పాడు.. అందుకని మీరు ఫ్రీ గా ఉంటే తాంబూలం ఇద్దామని" అంది ఇంగ్లీషూ, తెలుగూ కలిసిన భాషలో.

" ఓ అవును కదూ! పొద్దున్నే దేవుడికి దీపం పెట్టేడప్పుడు అనుకున్నాను. ఆ తర్వాత మర్చిపోయాను. అన్నాను.

అప్పటివరకూ ఆ అమ్మాయిని బయటే నిలబెట్టి మాట్లాడుతున్న సంగతి గుర్తొచ్చి

"తప్పకుండా ఇద్దువు గాని, రామ్మా, ముందు లోపలకిలోపలకి రా" అని పిలిచాను ఆనందంగా.

ఆ అమ్మాయి చెప్పులు గుమ్మం బయటే వదిలి లోపలకి వచ్చింది. చేతిలో ఉన్న బుట్ట టీ పాయ్ మీద పెట్టి దాంట్లోంచి పసుపూ, కుంకం శనగలూ, పసుపు రంగు దారం కట్టి ఉన్న గరిటెకి నల్లగా ఉన్న కాటుకా అన్నీ తీసి తనతో తెచ్చుకున్న పేపర్ మీద పెట్టింది. నన్ను కుర్చీలో కూర్చోమని చెప్పి సంప్రదాయబద్ధంగా కాళ్ళకి పూర్తిగా పసుపు రాసి, బొట్టు, కాటుక, గంధం అన్నీ ఇచ్చి వాయనం ఇచ్చింది.

"ఆ అమ్మాయి తెలుగు మాట్లాడుతున్న తీరు చూస్తే తెలుగు పిల్ల లా లేదు, కానీ ' ఇస్తినమ్మ వాయనం' అంటూ చక్కగా మూడు సార్లు చెప్పింది. నేను 'పుచ్చుకొంటినమ్మ వాయనం' అన్నాకా అక్షింతలు వేయించుకుంది నాచేత. పసుపు చెయ్యి వెళ్ళి కడుక్కుని వచ్చి తనతో తెచ్చిన చిన్న తువ్వాలుతో తుడుచుకుంది.

"ఒక్క క్షణం" అంటూ స్టీల్ డబ్బాలోంచి గుండ్రంగా బూరెల్లాంటివి వాయినం ప్లేట్ లో పెట్టి మరీ ఇచ్చింది.

"ఇదేమిటి? ఇవి కూడా ఇస్తారా?" అన్నాను ఆశ్చర్యంగా.

"మా అత్త చెప్పారు, తీపితో ఇస్తే, ఇచ్చిన వారితో మన రిలేషన్ తియ్యగా ఉంటుందిట. స్వీట్ ఎట్రాక్ట్స్ స్వీట్ అన్నమాట, అందరూ చేస్తారో లేదో నాకు తెలీదు, కానీ ఆమె పాటిస్తారుట, అందుకే నేను కూడా తను చెప్పిన ప్రకారమే చేస్తాను" అంది చిరునవ్వుతో.

"నీ స్వీట్ నేచర్ చూస్తే ఎవరికైనా నీతో రిలేషన్ ఇట్టే కలిసిపోతుంది. కూర్చోమ్మా! కాఫీ తాగి వెళుదువుగాని" అన్నాను. కాస్త దూరంగా ఉన్న మరో సోఫాలో కూర్చుని మమ్మల్నిద్దరినే చూస్తున్నారు మా ఆయన.

"లేదండీ! ఆఫీసుకెళ్ళాలి, ఈ రోజు లీవ్ దొరకలేదు, రెండు గంటలు లేట్ గా వస్తానని చెప్పి వచ్చాను. మరో సారి వస్తాగా! " అంటున్న ఆ అమ్మాయికి జ్యూసైనా ఇద్దామని లోపలకి వెళ్ళాను.

మరేమీ అనలేక జ్యూస్ తాగి వెళ్ళింది. వాళ్ళు తెలుగు వాళ్ళు కాదని, తెలుగు అబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుందని చెప్పింది. అత్తగారు ఇద్దరి కొడుకుల దగ్గరా తిరుగుతూ ఉంటారుట, వాళ్ళ బావగారు అమెరికాలో ఉన్నారనీ, ప్రస్తుతం అత్తగారు అక్కడే ఉన్నారని చెప్తూ, ఆవిడ ఫేస్ టైం లోనూ, స్కైప్ లోనూ తనకన్నీ ఎలా చెయ్యాలో చెప్తారని, ఆ ప్రకారమే చేస్తానని చెప్పింది. బూర్లు కూడా ఆవిడ సహాయంతోనే చేశానని, ఎలా ఉన్నాయో చూసి చెప్పమంది.. అలా రెండు నిమిషాల్లో జ్యూస్ తాగేసి వెళ్ళిపోయింది.

" అప్పుడప్పుడూ వస్తూ ఉండమ్మా!" అన్నాను అప్రయత్నంగానే.

" తప్పకుండా, మీరు కూడా రండి మా ఇంటికి!" అంది చనువుగా..

" నీ పేరేమిటమ్మా! అడగనే లేదు! అన్నాను అప్పటికి గుర్తు తెచ్చుకుంటున్నట్టుగా..

అప్పుడే మోగిన ఫోన్ సవ్వడిలో ఆమె చెప్పిన పేరు సరిగా వినబడలేదు.. ప్రమీల లా వినిపించింది. "అలాగా! చక్కటి పేరు" అన్నాను. అప్పటికే ఆ అమ్మాయి కంగారు పడుతూ పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది. కారిడార్ లో ఆ అమ్మాయి కనిపించినంతవరకూ చూస్తూ ఉండిపోయాను.

తలుపు వేసి లోపలకి వచ్చిన నన్ను చూసి నవ్వారు మా రాంప్రసాద్ గారు. అదే మా వారే.

" ఏవిటోయ్ సుగుణమణీ!! ఆ అమ్మాయిని చూసి అలా మైమరిచిపోయావు?" అన్నారు నా ముఖం ముందు చిటికెలు వేస్తూ..

" నిజమేనండీ! ఎంత చక్కగా ఉందో చూశారా? అంతకంటే చక్కటి నడత.. అత్తగార్ల పొడ కూడా గిట్టని ఈ రోజుల్లో అక్కడెక్కడినించో ఆవిడ చెప్పడం, ఈ అమ్మాయి అవన్నీ తూ.చా తప్పకుండా పాటించడం. ఎంత బావుందో వినడానికే! కదూ!" అన్నాను.

" నిజమే! మంచి పిల్లలా ఉంది" అన్నారాయన. కోడళ్ళ వేటలో ఉన్నాము, పెళ్ళంటే వద్దని మొండికేస్తున్న కొడుకుని ఒప్పించే ప్రయత్నాలే ఫలించడంలేదు ఇంకా. ఇలాంటి పిల్లలని చూస్తే ఆమాత్రం మా మనసు ఆశ పడటం చాలా సహజం.

" సరే! కిందకెళ్ళి కూరలు కొనుక్కొద్దామా?" అన్నారాయన.

"ఇదిగో ఓ బూరెనోట్లో వేసుకుని వెళదాం, ఎలా ఉందో చూసి చెప్పమంది కూడా అన్నాను నేనొకటి తీసుకుని ఆయనకొకటి ఇస్తూ..

" బావున్నాయి, కొంచం తొక్క దళసరి అంతే!" అన్నారాయన.

" అబ్బో! ఎన్నో ఏళ్ళు అనుభవం ఉన్నవాళ్ళకే సరిగ్గా కుదరవు, చిన్నపిల్ల పాపం, మొదటిసారి ఈ మాత్రం చేసిందంటే గొప్పే, అన్నట్టు వాళ్ళ ఫ్లాట్ నంబర్ ఏం చెప్పిందీ? 714 కదూ.." అన్నాను

" ఎందుకూ? ఇప్పు డే వెళతావా కొంపదీసి?" అన్నారాయన.

" ఇప్పుడెళ్ళను, ఆఫీసుకు వెళతానందిగా! సాయంత్రమెప్పుడైనా ఏదైనా కూరో, పచ్చడో తీసుకుని" అన్నాను.

ఇంతలో అయన సంచీ తీసుకుని వచ్చారు. మేము గేట్ దగ్గరకు వచ్చేసరికి ఆ అమ్మాయి కారులో గేట్ దగ్గరకి వచ్చింది. ఇందాకా చూసినది ఈ అమ్మాయేనా? అనుకున్నాను.తెల్లటి చిన్న పువ్వులున్న షర్ట్ వేసుకుంది, వదులుకున్న జుట్టు, పాపిటలో కనీ కనిపించనట్టుగా చిన్న సింధూరం చుక్క పెట్టుకుంది. మమ్మల్ని చూసి ఒక్క క్షణం కారాపి నవ్వి, చెయ్యి ఊపింది. మేము కూడా చెయ్యి ఊపాం.

" అరే! ఇంతలోనే ఎంత మారిపోయింది?" అన్నాను నేను.

" అవును మరి! ఆఫీసుకి అలా పట్టుచీరతో వెళ్ళదు కదా! సందర్భానికి తగ్గట్టుగా ఉండాలి కదా!" అన్నారాయన కూడా..

మరీ ఆ రోజు సాయంత్రమే వెళ్ళితే బావుండదేమోనని అతికష్టమ్మీద ఓ రెండు రోజులాగాను. ఈ లోపున మావాడు క్లయింట్ ఆఫీసుకంటూ ముంబై వెళ్ళాడు.

మూడు రోజులనించీ నేనా అమ్మాయినే కలవరిస్తూ ఉంటే సరేనని శనివారం సాయంత్రం నేను చేసిన టొమాటో పచ్చడి, కొరివికారం పట్టుకుని రెండు సీసాలతో వాళ్ళ ఇంటికి వెళ్ళాం.

" ఇంట్లో ఉన్నారో, లేదో?" అంటూనే ఉన్నాను ఆ కాస్త సేపూ.

" అబ్బా, సుగుణా, ఇంకో నిమిషంలో బెల్ కొడతాం, అప్పుడు తెలుస్తుంది కదా?" అన్నారాయన.

బెల్ కొట్టగానే దాదాపు మా అబ్బాయి వయసున్న అతను తలుపు తీశాడు.. చామనచాయలో పొడుగ్గా ఉన్నాడు, చూడగానే ఆకట్టుకునే రూపం, "కళ్ళూ, ముఖం లక్షణంగా ఉన్నాడు" అన్నాను నెమ్మదిగా.

" మీరు" అని అతను అంటుండగానే ప్రమీల వచ్చింది ఎవరా? అని చూడడానికి.

" ఓ, రండి, రండి! అంది తెలుగులో.. అప్పటికి ఆ అబ్బాయికి తెలిసిపోయింది మేమెవరమో.. ఇద్దరూ ఎంతో బాగా మాట్లాడారు. పొందిగ్గా, శుభ్రంగా ఉంది వాళ్ళ రెండు బెడ్ రూముల ఇల్లు.

"ప్రిసీ" కొంచం కాఫీ! అన్నాడు అతను..

" చేస్తాను" అంది ఆ అమ్మాయి లేస్తూ..

"నిన్ను చెయ్యమని కాదురా! నేను చేస్తాను" అని అలా అన్నాను అంటూ గబ గబా కాఫీ కలిపి కప్పుల్లో తెచ్చాడు, తోడుగా బిస్కట్లు పట్టుకుని ఆ అమ్మాయి వచ్చింది.

వాళ్ళ చదువులగురించీ, ఉద్యోగాల గురించీ, గురించీ కబుర్లు చెప్పారు. వాళ్ళిద్దరూ మంచి ఇన్స్టిట్యూట్ నించి ఎం.బి.యే చదువుకున్నారనీ, అక్కడే పరిచయం, ప్రేమా అంటూ చెప్పారు.. మరో గంట తర్వాత లేచి వస్తూ ఆ అమ్మాయితో అన్నాను

"వచ్చేవారం నించీ కావాలంటే నేను చేయిస్తానమ్మా పూజ" అన్నాను.

"వెంటనే సంబరంగా ఒప్పుకుంది. అత్తకి చెబ్దాం, పాపం ఎక్కువ రాత్రి వరకూ తను మేలుకొని ఉండక్కర్లేదు" అప్పుడు అంటూ ఫేస్ టైంలో అత్తగారితో మాట్లాడింది. మమ్మల్నిద్దరినీ పరిచయంచేసింది.. ఆవిడ కూడా ఎంతో మృదువుగా మాట్లాడారు. తన పేరు శాంత అని చెప్పారు. నేను చేయిస్తే తను అక్కడనించే చూస్తానన్నారు.

"మిగతా అన్ని విషయాల్లో నాకేమీ పట్టింపులు లేవు కానీ ఏవిటో ఈ పూజా పునస్కారలని మాత్రం వదులుకోలేకపోతున్నాను" అన్నావిడ మాటలకి నవ్వుతూ

"వదులుకోవడం ఎందుకు? మన శక్తి కొలదీ చేసుకుంటే సరిపోతుంది కదా! అయినా మీ కోడలు కూడా చక్కగా చేసుకుంటోంది కదా! పిల్లలకిష్టం లేకపోతే అది వేరు గానీ" అన్నాను నవ్వుతూ.. ఆ తర్వాత మా ఇంటికి వచ్చానన్నమాటే కానీ నా మనసంతా ఆ పిల్లలిద్దరిమీదే ఉంది..

"అవునూ! చక్కగా ప్రమీల అని అందమైన పేరుంటే ప్రిసీ అంటాడేవిటండీ ఆ అబ్బాయి? అనో, చిలకా గోరింకల్లా ఉన్నారు కదూ అనో ఇలా పడుకునే వరకూ ఏదో ఒకటి చెప్తూనే ఉన్నాను వాళ్ళ గురించి.

తర్వాత మంగళవారం చీకటితోనే లేచి, తల స్నానం చేసి పట్టుచీర కట్టుకుని వాళ్ళింటికి వెళ్ళాను. తలుపు ఓరగా తెరిచే ఉంది..

" ప్రమీలా! అమ్మా!" అంటూ పిలిచాను.. అప్పటికే తయారయిన ఆ అమ్మాయి వంటగదిలోంచి వచ్చింది.

"రండి! శ్రీకర్ ఇంకా నిద్ర లేవలేదు, రాత్రి పాపం పనితో లేట్ అయింది. మీరు బెల్ కొడితే తనకి మెలకువ వచ్చేస్తుందని నేనే తలుపు తీసి పెట్టాను" అంది చిరునవ్వుతో..

నేను కూడా నవ్వుతూ తలుపు వేసి వస్తూ చూశాను తలుపు పైనున్న గోడ మీదున్న నాలుగు ఫోటోలు.. శ్రీకర్, ప్రమీలల పెళ్ళి ఫొటోలు.. నల్లటి ఫుల్ సూటులో చందమామలా ఉన్న శ్రీకర్ పక్కన తెల్లటి పెళ్ళి గౌన్ వేసుకుని, తలమీద చిన్న కిరీటం పెట్టుకుని వెన్నెలమ్మలా మెరిసిపోతున్న ప్రమీల రెండు ఫోటోల్లో. మరో రెండు ఫోటోల్లో కెంపు రంగు పట్టుచీరా, తెల్లటి పట్టుపంచెల్లోనూ వాళ్ళిద్దరే..

ఆశ్చర్యంగా చూస్తున్న నన్ను చూసి నవ్వింది ప్రమీల.

" అవును" అన్నట్టు తలాడించింది, నా కళ్ళల్లో కనిపించిన ప్రశ్న తనకర్థం అయిందనుకుంటా.

ఇద్దరం కిచెన్ లో దేముడి దగ్గరకు వెళ్ళి చిన్న చాపల మీద కూర్చున్నాకా చెప్పింది. వాళ్ళ అత్తగారు ఆన్ లైన్ వచ్చేదాకా ఆగి మేము పూజ మొదలు పెట్టాము.

" ప్రిసీ ఇటు చూడమ్మా!నువ్వు పూజ చేశాక ఇచ్చే మొదటి వాయనం ఆంటీ ఇవ్వు" అని ఆవిడ చెప్పగానే ఆ అమ్మాయి ఆవిడ చెప్పినట్టే చేసింది.

“అర్జంట్ గా వెళ్ళాలి, ఆఫీస్ నించి ఫోన్ వచ్చింది, కాఫీ “అంటూ వచ్చాడు శ్రీకర్.

తను ఈరోజు శలవు పెట్టానని చెప్పింది ప్రమీల. మా పూజ అయిన కొంత సేపటికి శాంత బై చెప్పి నిద్రపోవడానికి వెళ్ళారు.

" కాఫీ తాగుదాం కూర్చోండాంటీ" అంది ప్రమీల.

" వద్దు ప్రమీలా! తాగే వచ్చాను కదా! అన్నాను

" తన పేరు ప్రిసీల కదా ఆంటీ! ప్రమీల అంటున్నారే ?" అన్నాడు శ్రీకర్ కాఫీ కప్పు టేబిల్ మీద పెడుతూ..

" అరే! మొదటిసారి తను చెప్పినప్పుడు నాకు అలాగే వినిపించింది. నువ్వూ ఎప్పుడూ చెప్పలేదేమ్మా?" అన్నాను.

ప్రమీల, ప్రిసీల రెండింట్లో పెద్ద తేడా ఏముందాంటీ? మీకలా వినిపించింది అంటున్నారు కదా పరవాలేదు.".

“ ప్రిసీ! నేను వెళ్ళనా? సారీ ఈ రోజు బట్టలన్నీ అక్కడే పడేశాను ! అన్నట్టు తడి టవల్ కూడా“ నెమ్మదిగా అన్నాడు శ్రీకర్.

" నో ప్రాబ్లెం! ఈ రోజు శలవు నాకు. నేను తీసి సర్దేస్తానుగా" అంది తను.

" థాంక్యూ!" అంటూ బై చెప్పి వెళ్ళిపోయాడు.

మేమిద్దరం మిగిలాం. "నువ్వెంత మంచి పిల్లవమ్మా! అన్నింటికీ నువ్వెంత అంటే నువ్వెంత అనుకునేవాళ్ళే కానీ ఇలా బుద్ధిగా నేను చూసుకుంటాలే అనేవాళ్ళు కూడా ఉన్నారా? “ అన్నాను.

"ఈ రోజు నేను చేస్తే, రేపు తను కూడా చేస్తాడు. న్యూటన్ సూత్రమే కదా ఆంటీ జీవితంలోనూ." అంది నవ్వుతూ..

"గడుసుదానివే, మేనేజ్మెంట్ గ్రాడ్యుయేట్ వి కదా! “ అన్నాను నేను కూడా నవ్వుతూ..

మీ అత్తగారి కోసం అలాగే చేస్తున్నావా? ఈ పూజలూ, వ్రతాలూ" అన్నాను నవ్వుతూ.. ఆ తర్వాత ఆ అమ్మాయి చిన్న బుచ్చుకుందేమో అనవసరంగా అన్నాను అనుకున్నాను.

" లేదాంటీ, మా అత్త ఎప్పుడూ నన్నేమీ చెయ్యమని చెప్పలేదు, తను చేసేవి మానలేదు, నేనే ఆవిడ అభిప్రాయన్ని గౌరవించి చేస్తాను. మా పెళ్ళికి అందరికంటే ముందు మరో మాటకి అవకాశమివ్వకుండా ఒప్పుకున్నది అత్తే, మా పాపా అయితేనా?" అంది. అలా అన్నప్పుడు ఆమె గొంతులో దిగులు..

" ఏమ్మా, మీ ఇంట్లో ఇష్టపడలేదా? ఇప్పుడు?" అన్నాను.

" అమ్మకేమీ ప్రాబ్లెం లేదు, పాపా కే, ఎందుకో ఇష్టం లేదు. చాలా గొడవ చేశారు, నేనసలు ఊహించలేదు అలా అంటారని. శ్రీకర్ చాలా మంచివాడు, అత్త ఇంకా.. మా బావగారు, తోడి కోడలు .. అందరికీ ఇష్టమైంది. కానీ మా నాన్న గారు మాత్రం నేను బ్రతికుండగా కుదరదు అని భీష్మించుకుని కూర్చున్నారు. మూడు నెలలు పట్టింది శ్రీకర్ దాదాపు రోజూ మా ఇంటికి వచ్చి నాన్నని ఒప్పించడానికి. మీకు తెలుసా? నెలకొకసారి అత్త కూడా వచ్చారు. ఆవిడ నాన్నతో అన్న మాటలింకా నాకు గుర్తున్నాయి..

" చూడండి పీటర్ గారు. ఈ రోజులు మన రోజు ల్లా లేవు, ఉండవు.. మార్పు మాత్రమే శాశ్వతం, సహజం. మారుతున్న కాలంతో మనం కూడా మారాలి. మనమున్నంత కాలం మనకి కావలసినవి ఈ చిన్నపిల్లలతో పెనవేసుకున్న బంధాలే. ఈ రిలేషన్స్ ని మేనేజ్ చేసుకుంటూ, అందంగా మలచుకుంటే చాలు అందరికీ ఆనందం ఎదురొస్తుంది. మీ అభ్యంతరం ఏమిటో చెప్తే కనీసం దాన్ని పరిష్కరించే మార్గం చూడచ్చు. అంతే కానీ మీరిలా భీష్మించుకుని కూర్చుంటే ఎవరికి మాత్రం ఏం తెలుస్తుంది?

శ్రీకర్ హిందువు అన్న ఒక్క కారణమే మీకు అభ్యంతరమైతే దానికీ మార్గం ఉంటుంది. నా దృష్టిలో దేవుడొక్కడే, ఎవరు వారికిష్టమైన పేరుతో పిలవవచ్చు. మా ఇంట్లో పుట్టాడు కనక వాడి ప్రమేయం లేకుండానే హిందువుగా పెరిగాడు అంతే కదా! నాకొడుకు కనక నేనేది చెప్తే అది విన్నాడు, చేశాడు అంతే తప్ప పుట్టుకతోనే ఎవరూ ఫలానా మతమని ముద్ర వేసుకుని పుట్టరు కదా! అన్నారు.

ప్రిసీలని మేము ఎప్పుడూ దేనికీ బలవంతం చెయ్యం. తనకిష్టమైన రీతిలో ఉండచ్చు. చెప్పాను కదా! ఇవన్నీ వ్యక్తిగతమైన ఇష్టాలు, నమ్మకాలు,. అన్న ఆవిడ మాటలకి కొద్దిగా మారారు. ఆయన సరే అంటేనే పెళ్ళి అని అత్తే గట్టిగా చెప్పారు.. అలా మా పెళ్ళి రెండుసార్లు జరిగింది" అంది ఫోటోలని చూపిస్తూ..

"బావుందమ్మా! చాలా ఉదాత్తమైన ఆలోచనలు శాంత గారివి" అన్నాను నేను మనస్పూర్తిగా..

"అవునాంటీ! ఆవిడ చాలా మంచి మనిషి.. అందుకే అత్త చెప్పిన బాటలోనే నేను నడవాలని నిర్ణయించుకున్నాను. ఆస్థి, అంతస్థూ, పేరూ, డబ్బూ ఎలాగైనా సంపాదించుకోవచ్చు. కలతలు లేని కుటుంబాన్ని సంపాదించుకోవాలంటే మనం కమనీయంగా నిలబెట్టుకోవల్సినవి బాంధవ్యాలే. రిలేషన్స్ సున్నితంగా, అందంగా మేనేజ్ చేసుకోవాలి. అదే నేను నమ్మిన సూత్రం.. అంది..

ఆ మాటే మంత్రంలా వినిపించింది నాకు..

COMMENTS